సుందరమ్మ మనసు

శ్రీ పేరాబత్తుని ఈశ్వరరావు

“ఆఁ! అదిగో... చెయ్యి వూపాడు. విడిక్కూడా పోయే కాలం దాపురించిందేమో!” అంటూ వంటి ఛ తలుపు మూసికొంది, సుందరమ్మ. పల్లెటూరి సుందరమ్మ యీ విషయాన్ని మొదటినుంచీ కనిపెడ్తూనే వుంది. ఈ చేయి వూపే జాడ్యం వాళ్ళకు వొక వ్యసనంగా మారడం వలన సుందరమ్మ కూడా అటువైపు చూడ్డం ఒక జాడ్యంగానూ, తరువాత వ్యసనంగానూ, యిప్పుడు అలవాటుగానూ మారింది. ఇటువంటి విషయాలంటే సుందరమ్మకు అసహ్యం మాట అటుంచి భయం జాస్తి. అలాంటప్పుడు అటువైపు అసలు చూడకుండా వుంటే వాళ్ళెందుకు చేతులు వూపుతారన్న ఆలోచన సుందరమ్మకు లేకపోలేదు. అయినా, యీ సారి కూడా వాడు అలాగే తనను చూచి చేయి వూపుతాడా? అని ఒక చిన్న ప్రయోగం చేస్తున్నట్లు చూస్తూవుండేది. సుందరమ్మ యిక చూడగూడదు. అనుకొంటూనే చూస్తుండేది, వాళ్ళూ అప్పుడే చేయి వూపడం కూడా జరుగుతుండేది.

సుందరమ్మ కాపురానికి వచ్చి అప్పుడే నెలకి పైగా అయింది. ఇంట్లో వంట పని అంత పెద్దది గాక పోవడంవలన నాలుగు ‘అత్తెసరు’ మెతుకులు వండి అవతలపారేస్తే యిక ఆ నాటికి వంట పని పూర్తి అయ్యేది. మిగిలిన గంటలన్నీ గడపడానికి ఏ పని కల్పించుకొందామన్నా కనుపించేదిగాదు. ‘ఇరుగిల్లూ, పొరుగిల్లూ’ అంటూ వుంటే అక్కడ అమ్మలక్కలతో ఏవో నాలుగు కబుర్లు ‘పిచ్చా-పాటీ’గా మాట్లాడుకొంటూ వుంటే యిట్టే కాలం గడచిపోతుంటుంది. ఇటువంటి అలవాటు సుందరమ్మకు చిన్నప్పట్నుంచీ వుండేది. సరిగ్గా తిన్న అన్నం మెతుకులు గొంతుకైనా దాటకుండా, పీట అయినా ఎత్తకుండా, కంచం అయినా కడక్కుండా, లంగాకి చేయీ, మూతీ తుడుచుకొంటూ వామన గుంటల పీట పుచ్చుకొనిగానీ, గచ్చకాయల డబ్బా పుచ్చుకొనిగానీ, చింతపిక్కల సంచి పుచ్చుకొనిగానీ, కోతిలాగా గంతులేసికొంటూ కన్ను త్రిప్పే లోపలే గడప దాటి పోయేది, ప్రక్క నున్న ‘జట్టీ’ వాళ్ళకోసం. పోనీ, పెద్దదయ్యాకైనా సుందరమ్మ కాళ్ళు కట్టుబడతాయనుకొంటే అబ్బే! అప్పటి అలవాట్లు అప్పటిలాగే లేకపోయినా, కొంచెం మార్పులతో పర్యవసానం మాత్రం అంతే వుంటుండేది. చందమామనుంచి సచిత్ర వారపత్రిక వరకూ పుస్తకాలు తిరగేయడం, ఆ కథల గురించి, రచనలు గురించి తోటి స్నేహితులలో తర్జన భర్జనలు చేయడం, నవల్ను చదవడం... సినిమా స్పీచ్‌లూ, నటనలూ, వారి దినచర్యల్లో, మాటల్లో, అభినయాలతో కూడా కన్పిస్తుండేవి. ఇక వాటికి అంతూ, దరీ, అంటూ వుండడం ఎప్పుడన్నా, ఎవరన్నా, ఓ తల మాసినా విడ నాలుగు చివాట్లు పెట్టి విదిలించుకొంటేనే వాళ్ళు లేవడం.

సుందరమ్మకి రైలు అంటేనే క్రొత్త. వాళ్ళ వూరికి ముప్పయి మైళ్ళ దూరంలో ఎటూ రైలు స్టేషన్ లేకపోవడం వలన రైలు అంటే ఒక పెద్ద భూతంలాగా వూహించే వాళ్ళు, ఆ వూరి వాళ్ళంతానూ. నూటికీ, కోటికీ యెవరన్నా రైలు చూసి వస్తే ఆ యింజనును అలాగే వర్ణించే వారు కూడాను ఓ పెద్ద భీకరాకారం అనీ, దానికి పెద్ద గొంతుక వుందనీ కూడా! సుందరమ్మ పుట్టి పెరిగిన తరువాతంతటికీ తన భర్త దగ్గరికి వచ్చేటప్పుడే రైలు యెక్కడం మొదటి సారి. అలాంటి సుందరమ్మ రైల్వే మాష్టరు పెళ్ళాం కావడం మొదట్లో భయం తిరువాత విచిత్రంగానూ కనిపించినా యీ నెల్లాళ్ళల్లో ఆ యింజను కూతలకూ, బళ్ళ శబ్దాలకూ సుమారుగా అలవాటు పడింది.

సుందరమ్మకి ఆ రయిల్వే స్టేషన్ ఒక నరకం కంటే హీనంగా కనుపించింది ఆ రైలు వచ్చే వేళకు కళ్ళముందు నాలుగు యెడ్లబళ్ళూ, పాతిక మంది జనం అయినా కనుపిస్తారు ఆ బండి కాస్తా వెళ్ళిపోయాక ఒక పిట్ట కూడా వుండదు. పోనీ యిరుగమ్మా, పొరుగమ్మా వున్నారా! అంటే, దూరంగా వున్న రెండు రయిల్వే పోర్టర్ల యిళ్ళు తప్పితే అక్కడయినా ఏముంటయ్ అని. ఆ రోడ్ సైడ్ స్టేషన్‌లో యింజను కూతలూ... ఆ గొడవ లే... ఆనందించినా, అఘోరించినా!

అంచేత సుందరమ్మ ఒక పుస్తకం చేత పట్టుకొని యింటిముందు వేపచెట్టు క్రింద కూర్చొని వచ్చే బండినీ, పోయే బండినీ చూస్తూ వుంటుంది. ఆనందరావు డ్యూటీ ఏడు గంటల వరకూ వుండడంవలన సుందరమ్మ అప్పటివరకూ అలా కూర్చోవడం అలవాటయిపోయింది. అలాంటప్పుడు ఆ యింజను డ్రైవర్లు ఆమె వైపే చేతులు వూపడం నిజానికి అంత సమంజసమైన పని కాదు. కోపం వచ్చి, వుక్రోషం కొద్దీ సుందరమ్మ వాళ్ళను ఏడ్పించడానికి తనూ చేయి వూపుదామనుకొంది. అలా తాను చేస్తే... అమ్మో! ఆ రయిల్వే సెక్షన్ అంతా యీ డ్రైవర్లు ఒకే ‘పుకార్లు’ లేపరూ! ఫలానా మాష్టరు పెళ్ళాం యిలా చేస్తుందని. అది తన మగడి చెవులు వరకూ వస్తే... కొరివితో తలగోక్కున్నట్టేగా!

సుందరమ్మ యీ విషయాన్ని ఒకరోజు ఆలోచించి వూరుకోలేదు. ప్రతి దినం వాళ్ళు చేతులు వూపడం యీవిడ చూస్తూ వుండడం జరుగుచుండేది. పోనీ, ఆయనతో చెప్తే... ఇటువంటి విషయాలు అసలు మగవాళ్ళకు చెప్పవచ్చా? వాళ్ళూ, వాళ్ళూ తలలు పగలుగొట్టుకోవడం ఆఫీసర్లకు రిపోర్టు చేసికోవడం.. అవన్నీ అలావుంచి చివరకు తనకే వక రిమార్కు వస్తుంది. ‘నీవైపు చూడందే వాళ్ళలా ఎందుకు చేస్తారనీ.. అసలు ముందు నీవేం చేశావో’ అనీ. ఈ విషయం సుందరమ్మకు బాగా తెలుసు. అందుచేత ఆనందరావుకి అసలు చెప్పనైనా చెప్పలేదు.

సుందరమ్మ పెద్ద అందగత్తె కూడా కాదు. అసలు తను అందగత్తెను కాదన్న విషయం సుందరమ్మకే బాగా తెలుసు. వీథి బళ్లో సుందరమ్మను ‘గుడ్లగూబ’ అనీ, లోయర్ క్లాసుల్లో ‘కిరసనాయిలు డబ్బా’ అనీ, అటు



ఇంజన్ డ్రైవరు చెయ్యూపుతున్నాడు. తనుకూడా చెయ్యూపితే? అమ్మో! అనుకుంది పల్లెటూరిసుందరమ్మ.

తిరువాత ‘చింతపండు’ అనీ...ఏవేవో నిక్‌నేమ్సు పెట్టివెనుక భో...భో...లు కొట్టడం సుందరమ్మకు బాగా జ్ఞాపకం. పైన చెప్పిన నిక్‌నేమ్సులోని పోలికలు నిజానికి సుందరమ్మలో చాలా వున్నయ్. ఆ చిన్నారావుగాడు ముందు బెంచీలో కూర్చొని సుందరమ్మముఖం చూసినప్పుడల్లా రెండు చేతుల్తో ముఖం మూసికొని వాంతి వచ్చినట్లు నటించడం, ‘సుందరమ్మ’ అని ‘రోల్ కాల్’ పిలుస్తుంటే ‘అబ్బో’ “అపురూపసుందరి” అని వెక్కిరించడం... యివన్నీ ఆమె వినలేదు గనుకనా? అటువంటప్పుడు ఈ దౌర్భాగ్యపు వెధవలు తనను చూడగానే వాళ్ళు కొవ్వెక్కిగాక పోతే అలా చేతులు వూపడం దేనికి? “ఏమీ తెలియని నంగనాచుల్లాగా, యింజను మెషీన్లమీద దృష్టిని నిలకడ చేసినట్లు నటిస్తూ ముఖం అటు త్రిప్పి... పక్కకే యిలా చేతులు వూపడం దేనికో? యీలాంటి తతంగాలు ఎవరికి తెలియవని” అని సుందరమ్మ అనుకొంటూ వుండేది.

ఆనందరావు పనిచేసే స్టేషనులో నీళ్ళు దొరకవు. అంచేత ప్రతి గూడ్సు బండికీ వాళ్ళు నీళ్లు పట్టుకొంటారు. సుందరమ్మకు డి నీళ్లవడంచేత ఎంత తప్పించుకొన్నా రెండు బిందెలు నీళ్ళన్నా తెచ్చుకోవాలి—అంటే... ఒక్క సారయినా యింజను దగ్గరకు వెళ్లాలి.

రోజులు గడచిన కొద్దీ సుందరమ్మలో మార్పులు రావడం మొదలు పెట్టాయి. నిజానికి ఆమెకు ఎటువంటి దురభిప్రాయాలు లేకపోయినా భాస్కర్రావును చూస్తే ఆమెలో యేదో తెలియని ఒక విధమైన సంచలనం... ఆమె మనస్సును కలతపరుస్తుండేది. భాస్కర్రావు 207 నెంబరు యింజనులో వస్తూవుంటాడు. కండలు తిరిగిన దండలు, ఆజానుబాహుడు. విశాలమైన ఫాలభాగం, వుంగ్రాల జుట్టూ, యెంతటి మాసిపోయిన, బొగ్గు నూనెదుస్తులు వేసికొన్నా అతనిలో గల గాంభీర్యం, ఠీవి... ఒక విధమైన అందం—సుందరమ్మ మొదట్లో ఏమీ అనుకోకపోయినా రానురాను ఒక విధమైన అభిమానం అంటూ కల్గింది. అందరికీ మల్లే అతనూ, ఆమెను చూడగానే చేయి వూపుతాడు. అయితే ఆమెకు భాస్కర్రావు విషయంలో అసహ్యం లేదు. అంటే యిష్టమున్నదనీ గాదు. ఇష్టానికీ, అయిష్టానికీ మధ్యగల ఏదో తెలియని అవినాభావ సంబంధం వుండి వుండవచ్చు.

భాస్కర్రావు వచ్చేరోజు అంచనా వేసికొని సుందరమ్మ చక్కగా ముస్తాబై మరీ నీళ్లకు వెళ్తుంది. నీళ్ళు పట్టుకొనేటప్పుడు మాత్రం వాళ్లు ఏమీ మాట్లాడేవాళ్లు గాదు. “దూరంగా వుంటేనే యీ ఆర్భాటం అంతానూ, చేతులూపడమూను...అంత దగ్గరగా వెళ్తే ముఖమైనా చూడ్డే!” అని మాత్రం మనసులో సుందరమ్మ బాధపడడం అక్షరాలా నిజం. అయితే భాస్కర్రావుకి తనంటే ప్రేమలేదా! దగ్గరగా వెళ్లాక ముఖమైనా చూడకుండా తన కేమీ పట్టనట్లు యింజను మెషీన్లు తుడుచుకొంటూ వుంటాడు—ఈ విషయంలో సుందరమ్మమనస్సులో యెంతో కష్ట పెట్టుకొనేది.

ఆరోజు 207 యింజను వస్తుంది. అంటే భాస్కర్రావు వస్తాడన్న మాట. సుందరమ్మ నీటుగా ముస్తాబయింది. బిందెలు రెండు మూడుసార్లు తళతళా మెరిసేటట్లు తోమింది. కట్టుకొన్న మడిబట్టలో కూడా కొంత ప్రత్యేకప్రదర్శన చూపించాలనుకొంది.

సిగ్నలు యివ్వనూ యిచ్చారు. బండి రానూ వచ్చింది. ఈసారి ఏమైనా సరే భాస్కర్రావుతో మాట్లాడాలనుకొంది సుందరమ్మ. ఆరోజు భాస్కర్రావు స్వయంగా నీళ్లు వదిలాడు. సుందరమ్మ తలయెత్తి భాస్కర్రావు వంక ఒక్కసారి చూచింది. అతనిముఖంలో ఏవిధమైన భావప్రకటనా లేదు. విసిగి వేసారిన జీవితానికి అలవాటు పడిన వ్యక్తి ఆ యంత్రాలతో తానూ వొక ‘యంత్రం’ లా పని చేస్తున్నట్లు కనుపించాడు, భాస్కర్రావు. అయినా సుందరమ్మ కాయశక్తులా తన తీక్షణ వీక్షణాలను ప్రదర్శించినా పర్యవసానం ఏమీ కనుపించలేదు.

"వేడినీళ్లు యిస్తారా!" అని సుందరమ్మ అడిగింది. నిజానికి వేడినీళ్లు సుందరమ్మకు అవుసరం లేదు. ఎలాగైనా భాస్కర్రావుతో మాట్లాడాలనుకొంది సుందరమ్మ. అందుచేతే అడిగింది.

"అలాగే నమ్మా" అంటూ భాస్కర్రావు వేడినీళ్లను వదిలాడు, చన్నీళ్లను కట్టివేస్తూ.

ఈ మాటలు వినేసరికి సుందరమ్మ మనస్సు చివుక్కు మన్నది. ఆయన "అమ్మా" అంటాడేవిటి అనుకొంది. భాస్కర్రావు మాటల్లో అతని ప్రవర్తనలో తన కోసం అతను, ఏ అణుమైనా పరితపిస్తున్నట్లు కనుపించలేదు. మాట్లాడేటప్పుడు సుందరమ్మ వక్కైనా చూడలేదు.

బండి కదలింది. రోజూ యీపాటికే సుందరమ్మ యింట్లోకి వెళ్లిపోయేది. ఆవేళ మాత్రం అలాగే చూస్తూ నిలబడింది. కొంత దూరం బండి వెళ్లాక భాస్కర్రావు మామూలుగా మళ్లా చేయి వూపాడు, ఆమె వైపే చూస్తూ.

భాస్కర్రావు ప్రవర్తన సుందరమ్మకేమీ నచ్చలేదు. దగ్గరున్నంతసేపూ పల్లెత్తు మాట అయినా మాట్లాడని భాస్కర్రావు అంత దూరం వెళ్ళాక తనవైపే చేయి ఎందుకు వూపాలి? అతని దొక విచిత్ర ప్రవర్తన అనుకొంది. భాస్కర్రావు మీద జాలి, కోపం, ద్వేషం...ఒక్క సారిగా సుందరమ్మమనస్సులో కనుపించాయి. పంతానికి ఏమైనా సరే తానూ చేయి వూపాలనుకొంది. యిదే ఆఖరు ప్రయత్నంగా.

అప్రయత్నంగా సుందరమ్మ చేయి యెత్తేసరికల్లా గార్డు పెట్టె వచ్చేసింది. ఆ గార్డు వంక చూసేసరికి అతడూ అలాగే చేయి వూపుతున్నాడు, అయితే సుందరమ్మ వంక చూసి మాత్రం కాదు.

సుందరమ్మకు యిదేమీ అర్థం కాలేదు. భాస్కర్రావు చేయి వూపడానికి కారణం తాను వూహించుకొన్నది గాని యీ గార్డు యెందుకు వూపుతున్నదీ, అర్థం గాలేదు' అనుకోకుండానే యెత్తిన చేయి దింపుకొని వెనక్కి చూసేసరికి ఆనందరావు కూడా అలాగే స్టేషను ముందు నిలబడి నవ్వుతూ తన చేతిని వూపుతున్నాడు.

సుందరమ్మగుండె గతుక్కు మన్నది. ఇప్పుడు పూర్తిగా అర్థం అయిపోయింది. భాస్కర్రావు సుందరమ్మ వైపు చేయి వూపడం, తానూ చేయి యెత్తడానికి ప్రయత్నించడం— యివన్నీ చూచి, ఆ గార్డు వాళ్ళయినా, సుందరమ్మను పరిహసిస్తున్నారనుకొంది.

సుందరమ్మ భయపడి పోయింది. తన విషయం అందరికీ తెలిసిపోయినందుకు విచారం, తన భర్త కళ్ళారా చూచినందుకు భయం, ఆమెను వేధించేశాయి. సాయంత్రం తన భర్త వచ్చి తప్పకుండా అడుగుతాడు. తన జీవితంలో ఒక అగ్నిపరీక్షను ఎదుర్కోబోతున్నాననుకొంది.

ఆ పగలంతా సుందరమ్మ లోలోన చాలా భయపడిపోయింది. తలుపు దగ్గర ఏ మాత్రం శబ్దం వినిపించినా ఆనందరావు

[38-వ పేజీ చూడండి]

జెక్‌స్లోకియాలో ప్రఖ్యాతిగాంచిన 'స్కోడా' కంపెనీవారిచే తయారుచేయబడిన

ట్రాక్టర్లు,

డీజిలు

యింజన్లు

స్కోడా డీజిలు యింజను ౪ నుండి 85 హార్సుపవరు వరకు కోల్డు స్టార్టింగు హారిజెంటల్ మరియు వర్టికల్—

★



26 హార్సుపవర్ "జెటర్" ట్రాక్టరు డీజిలు ఆయిలుతో పనిచేయును. బొంబాయి ప్రభుత్వమువారితో ప్రత్యేక సర్టిఫికెట్టు పొందినది. అన్ని రాష్ట్రములలో ప్రసిద్ధిచెందినది. దీనిపైజుగల అన్ని ట్రాక్టరుల కంటె ఖర్చుతక్కువలో ఎక్కువ పనిచేయును. ధర తక్కువ. నవీనపద్ధతులతో తయారు చేయబడినది. వాయిదా పద్ధతిమీద కూడా యివ్వబడును. విడిభాగములు, సర్వీస్ ఎల్లప్పుడు లభించును. ట్రాక్టర్లకు పనికివచ్చు అన్ని వ్యవసాయ పనిముట్లున్నూ, ట్రైలర్లు దొరకును. ఒకసారి మా షో రూముకు దయచేసి చూడండి.

ఏజంట్లు: కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం జిల్లాలకు

ది పద్మజా కమ్మర్షియల్ కార్పొరేషన

ప్రొప్రయిటరు: వల్లూరుపల్లి కేశవరావు చౌదరి

S. B. 42. కాశీశ్వరరావు మార్కెట్టు, విజయవాడ 1.

మీరు మాత్రం ఏమీ పెట్టకూడదన్నాడు' కాపలాఉండే కనిష్టేబు.

'ఏం?' అన్నాడు భగవాన్లు రిత్తపోయి.

ఇన్నాళ్లూ ఈయనికి రిమాండు.

ఈ రోజు నుండి శిక్ష, శిక్ష వేసీ, రేపు రాజమండ్రీ సెంట్రల్ జైలుకు కట్టేస్తారు. కుర్రాడిక్కి విపులంగా వివరించాడు.

'మరి మా అన్నం మీకక్కర లేదూ?' మామయ్యా అని ఒక్కసారి కూలబడ్డాడు. ఆశా సౌధం కూలిపోయింది. అనుకున్న ఆలోచన్లు గాలి మేడలయ్యాయి – భగవాన్లు లాల్చీ కన్నీళ్లతో తడిసి ముద్దయింది.

'కండువాతో, కారే కన్నీటిని వత్తుకుంటూ,' భగవంతునిపై భారం వేసి, నోట మాటరాని అయోమయ పరిస్తితిలో అల్లల్లాడుతున్నాడు ఆదికేశవులు.

ఆప్యాయంగా రెండు చేతులు చాచాడు కుర్రాడికేసి పెంచిన ప్రేమ చేత.

గానీ ఆనాడు దుఃఖాన్ని ఐ. జి. ఆర్. ఇంజను అడ్డు, ఈ నాడు ఇనుప కటకటాలు అడ్డయ్యాయి భగవాన్లుకి.

'జాగ్రత్తగా ఉండండి. నే వస్తా' అని ధైర్య మిచ్చింది పెంచిన ప్రాణం

స్వాధీనంలో లేని మామయ్యాని విడిచి రాలేక, వచ్చేదెప్పుడో, అని దీనంగా చెట్టు క్రింద చతికిల పడ్డాడు భగవాన్లు. ★

సుందరమ్మ మనసు

(10-వ పేజీ తరువాయి)

వచ్చాడు, యిక తప్పక అడుగుతాడని ఎంతో కంగారుపడేది.

సాయంత్రానికల్లా ఆనందరావు వచ్చాడు. గాబరాగా వున్నా, సుందరమ్మను ఆనందరావేమీ గమనించలేదు. ఏమీ అడుగలేదుకూడాను. సుందరమ్మ కూడా ఆనందరావులో ఏవీ మార్పులు లేకపోడానికి చాలా సంతోషించింది. అయినా భయం మాత్రం లోపల భయపెడ్తూనే వుంది.

* * *

తమలపాకుల చిలకలందిస్తూ సుందరమ్మ తన సందేహం తీర్చుకో మొదలు పెట్టింది

"ఏమండీ! మిమ్మల్ని ఒక మాట అడగనా" అని.

"ఏమిటి?"

"చెప్తారా?"

"చెప్పనని యెప్పుడైనా అన్నానా?" అన్నాడు ఆనందరావు, హాస్య ధోరణిలో.

"ఉదయం నేను నీళ్ళు పట్టేటప్పుడు నవ్వుతూ చెయ్యి వూపారెందుకు?" అని అపావలిసిన కొస్తమాటా అడిగేసింది, తడియారిన కంఠంతో, జవాబుకోసం వళ్ళంతా చెవులు చేసికొని.

"బండి వెళ్ళేటప్పుడు అలాగే చేయి వూపాలి" అన్నాడు ముక్తసరిగా.

సుందరమ్మ అనుకొన్నది ఒకటయితే, ఆనందరావు జవాబు యిచ్చినది యింకొకటి అయింది. సుందరమ్మకు యిదేమీ అర్థం కాలేదు. ఒకవేళ తన భర్త యీ మాటల్తో నిజం చెప్పకుండా మభ్యపెట్టడం లేదు. గదా? ఏమో! ఎవరికి తెలుసు, మనిషిలోని మర్మం అంచేత మళ్ళా ప్రశ్నించింది "ఎందుకు అలా వూపాలండీ" అని. తన సందేహాన్ని పూర్తిగా తీర్చుకోడానికి.

"బండి వెళ్ళేప్పుడు గార్డు, డ్రైవరు, మాష్టరు...ముగ్గురూ బండి సరిగ్గా నేబయులుదేరుచున్నది అన్నట్లుగా పచ్చజండాలు వూపాలి. దీనికోసం అని లోని జండాలు తెచ్చి ఎవరు వూపుతారని సాధారణంగా చేతులనే వూపుతాం" అనేసరికి సుందరమ్మ తెల్లబోయి యింకేమీ మాట్లాడలేక 'అలాగా' అంటూ ఆనందరావు ప్రక్కన వాలిపోయింది. "ఏం? ఎందుకు, నీకీ 'అజలు'? నీవు కూడా మాష్టరు పని చేయాలని వుందా?" అంటూ ఆనందరావుసుందరమ్మను దగ్గరకు తీసికొన్నాడు, పాపం! సుందరమ్మ అసలు ఆ ప్రశ్న యెందుకు వేసిందో, నిజం అర్థం గాక.

ఇంకా నయ్యం! భాస్కర్రావుతో పాటు సుందరమ్మ కూడా చేయి వూపలేదు. ★

శ్రీ అంబాళ్

ఆఫీసరస్ నస్యము

1 తులము టన్నులలో అన్ని చోట్ల దొరుకును.

శ్రీ అంబాళ్ అండు కంపెనీ,

తపాలు పెట్టెనెం 8. మదరాసు

ఇంగ్లీషు విద్యాబోధిని

ఒకరి సహాయ మక్కరలేకయే ఆంగ్ల భాషను తేలికగ నేర్చుకొనుటకు వీలుగ వ్రాయబడినది 30 దినములలో మంచి భాషాజ్ఞానమును నేర్వవచ్చును. వెల 1-0-0

ఆధునిక కామస్త్రము

స్త్రీ పురుషులకు సంబంధించిన అనేక రహస్య విషయములు, పాశ్చాత్యుల పద్ధతులు మున్నగునవి విపులీకరింపబడినవి. వెల 2-0-0. పోష్టుఖర్చు వేరు.

ఈశ్వరి & కో

పోష్టుబాక్సు 139 - మద్రాసు